

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు'

తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శనివారం 03 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 13 | పేజీలు : 04, వెల రూ.2

అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం

వివరాలు వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ఈ సీజన్‌లో ఏపీలో 34.9 శాతం మేర వర్షపాతం లోటు

అమరావతి : నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. మిగతా..2లో

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ



ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు

కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ

నల్గొండకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు మిగతా..2లో

నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!



- 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్
- 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత
- ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం

రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా చేసి చూపిస్తున్నా

- అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది.
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి కృతజ్ఞతలు.
- 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుంది



అమరావతి : గాంధీ జయంతి సందర్భంగా కరవుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. అక్షరాలా రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ కరవు పరిస్థితులు, రైతుల కష్టాలను నిర్మలా సీతారామన్‌కు పలు సందర్భాల్లో వివరించానని రైతుల బాధలను నిర్మలా సీతారామన్ అర్థం చేసుకున్నారని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 'రాయలసీమ ఉద్యాన హబ్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అలానే అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని ఏ ప్రాజెక్టునైనా జయప్రదం చేసేవరకు వదిలిపెట్టని వ్యక్తి అనంత్ అంబానీ అని ప్రశంసించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. సాగునీరు ఇస్తే బంగారం పండిస్తారు: రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పానని అలానే చేసి చూపిస్తున్నానని సీఎం అన్నారు. తాను, పవన్, మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. మోదీ నమ్మకాన్ని నిజం చేస్తూ నిర్మలాసీతారామన్ మిగతా..2లో

రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి



- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్

విదేశీ అప్పులపైనే పాక్ బతుకు.. ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!



- విదేశీ రుణాలు, డిపాజిట్లపైనే ఆధారపడుతున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ
- ఎగుమతులపై దృష్టి పెట్టకపోవడమే సంక్షోభాలకు అసలు కారణమని విశ్లేషణ
- చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ కూడా ఎగుమతులను పెంచడంలో విఫలం
- అప్పులు, డిపాజిట్లు తాత్కాలిక ఉపశమనమేనని నిపుణుల హెచ్చరిక
- ఎగుమతులు పెరగకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం

ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

- ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం
- 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్



ఢిల్లీ : భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్యర్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత మిగతా..2లో

కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

- అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం- తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు
- ఏపీ, రాయలసీమలో బలమైన ఈదురుగాలుల హెచ్చరిక



హైదరాబాద్: : వర్షాకాలంలో కూడా సమ్మర్ లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది! నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు.

విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలివే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు ఈరోజు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు.
- సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది.



హైదరాబాద్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. (శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు. మిగతా..2లో

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి విక్రమార్క



- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

మొదటి పేజి తరువాయి

రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

అమరావతి : రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్: గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను' ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ

పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..



సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా - చేసి చూపిస్తున్నా

మొదటి పేజి తరువాయి

ముందుకు సాగుతున్నారని కొనియాడారు. పోలవరం ప్రాజెక్ట, విశాఖ ఉక్కుకు నిధులిచ్చి ఆదుకున్నారని తెలిపారు. సీమ దశ, దిశ మార్చి గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు తీసుకొచ్చామని, కరవు నేలను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. పండ్ల తోటల సాగులో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని సాగునీరు ఇస్తే సీమ ప్రజలు బంగారం పండిస్తారని సీఎం కొనియాడారు. "ఎన్టీఆర్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకెళ్తున్నాం. హంద్రీనీవా ద్వారా నీళ్లు లేకపోతే మదనపల్లె మొత్తం వలసపోయేది. సీమ పరిస్థితులు మార్చేందుకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. పంటకుంటలు,



వాటర్‌షెడ్ పథకాలు ఏర్పాటు చేసి జలసంరక్షణకు ప్రాధాన్యమిచ్చాం. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తిచేసి మూడేళ్లలో జాతికి అంకితం చేసే బాధ్యత మాది. సీమలో హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచి కెనాల్ విస్తరణ పూర్తికి చర్యలు తీసుకుంటాం. రాయలసీమను కరవు సీమ కాదని మరోసారి నిరూపిస్తా."- చంద్రబాబు, ముఖ్యమంత్రి 20 రకాల పంటల్లో ఏ పంట అయినా పండించే సత్తా సీమ రైతులదని ఉత్పత్తికి మార్కెట్ సౌకర్యమిస్తే సంపద సృష్టిస్తారని సీఎం చెప్పారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో పంటలు, ధరలు, వాతావరణ స్థిరీకరణ జరుగుతుంది వెల్లడించారు. అనంత్ అంబానీ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో జంతువుల పునరావాస కేంద్రాన్ని అనంత్ అంబానీ ఏర్పాటు చేశారని అలానే తిరుమల శ్రీవారిపై భక్తితో అనంత్ అంబానీ ఉచితంగా ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చారని వెల్లడించారు. పోలవరం పనులు ముమ్మరంగా సాగుతున్నాయమని ప్రాజెక్టును పూర్తిచేసి మోదీ చేతులమీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా ం!

మొదటి పేజి తరువాయి

అమరావతి: 'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

కరవు సీమ నుంచి ఫలాల సీమగా..



ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలివే

మొదటి పేజి తరువాయి

అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి



యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ పాల్గొన్నారు.

కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

మొదటి పేజి తరువాయి

కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

తమిళనాడులో గాలుల వేగం

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తమిళనాడుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వాతావరణం మారే అవకాశం ఉంది. వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

కర్ణాటకలోనూ వానలు

కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం మారొచ్చు. మహారాష్ట్రలోని కోంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది.

ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాలు

దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాల పరిస్థితి కొనసాగనుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని చోట్ల భారీ వర్షం పడే అవకాశం ఉంది. ఒడిశా, బంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చు. బిహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు



పడే అవకాశం ఉంది.

ఉత్తరాదిలో రుతుపవనాల వెనక్కి ప్రయాణం

అదే సమయంలో ఉత్తర భారతంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు త్వరలో వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. అలా ఉత్తర భారతంలో వానలు తగ్గి వాతావరణం పొడిగా మారుతున్నా, దక్షిణ భారతంలో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాల ప్రభావం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులను గమనించాల్సి ఉంటుంది.

విదేశీ అప్పులపైనే పాక్ బతుకు.. ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అందే రుణాలు, సౌదీ అరేబియా, చైనా వంటి మిత్ర దేశాలు ఇచ్చే డిపాజిట్లపైనే దేశం పూర్తిగా ఆధారపడి ఉంది. ఈ నిధులు ఎప్పటికప్పుడు తలెత్తుతున్న చెల్లింపుల సంక్షోభం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) నుంచి తాత్కాలికంగా గట్టెక్కిస్తున్నప్పటికీ, దేశానికి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఓ నివేదిక స్పష్టం చేసింది. 'డాన్' పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. పాకిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తమ భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను అడ్డుపెట్టుకుని విదేశీ మద్దతు పొందడంపైనే దృష్టి సారించింది తప్ప, ఎగుమతి ఆధారిత సుస్థిర వృద్ధి నమూనాను నిర్మించలేకపోయింది. దీని ఫలితంగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగినప్పుడల్లా అది దిగుమతులు, వినియోగం ఆధారంగానే జరిగింది. దీంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు తరచూ అడుగంటిపోవడం, సంక్షోభం తలెత్తడం ఒక చక్రంలా కొనసాగుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అప్పటి సైనిక పాలకుడి హయాంలో పాకిస్థాన్‌కు భారీగా విదేశీ నిధులు, రుణమాఫీ, పెట్టుబడులు వెల్లువెత్తాయి. అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఆ నిధులన్నీ దిగుమతులు, వినియోగం, రియల్ ఎస్టేట్ రంగాలకు మళ్లడంతో 2008 నాటికి దేశం రికార్డు స్థాయిలో కరెంట్ ఖాతా లోటును ఎదుర్కొని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ముఖ్యంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) దేశంలో విద్యుత్ కొరతను తీర్చడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి దోహదపడింది. కానీ, విదేశీ రుణాలు తగ్గించుకోవడానికి అవసరమైన ఎగుమతుల వృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. పైగా సీపీఈసీ ప్రాజెక్టుల కారణంగా దిగుమతులు మరింత పెరిగి 2018 నాటికి కరెంట్ ఖాతా లోటు మళ్లీ



ఆందోళనకర స్థాయికి చేరింది. కరోనా మహమ్మారి తర్వాత తీసుకున్న ఉద్దీపన చర్యలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కమోడిటీ ధరలు, రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు పూర్తిగా ఐఎంఎఫ్ కార్యక్రమాలు, మిత్ర దేశాల డిపాజిట్లపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే, ఈ నిధులు దేశంలో ఆర్థిక కార్యకలాపాలను నేరుగా సృష్టించవని, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని తీసుకురావని నివేదిక హెచ్చరించింది. మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ నిధుల లభ్యత కూడా ఎప్పుడూ

చీనీ తోటలను కాపాడేందుకు మంత్రి చొరవ
ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు




ధర్మవరం, దరువు న్యూస్: ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరత ఏర్పడి చీనీతోటలు, ఇతర ఉద్యాన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే




సత్యకుమార్ యాదవ్ చొరవ తీసుకున్నారు. నీటి సమస్యను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి తోటలను కాపాడేందుకు తక్షణ ప్రత్యామ్నాయ నీటి వసతి కల్పించాలని సూచించారు.మంత్రి సూచనలపై స్పందించిన కలెక్టర్ చీనీతోటలు, ఇతర ఉద్యాన పంటలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.రైతులు సొంతంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసుకున్న సందర్భంలో ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.చెల్లింపుల విధానం, అర్హతలు తదితర అంశాలపై ఉద్యానశాఖ అధికారులతో సమన్వయం చేసి రెండు మూడు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తోటలు ఎండిపోకుండా రైతులకు తక్షణ ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



కదిరి పట్టణంలోని టవర్ క్లాక్ సమీపంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ కదిరి పట్టణ శాఖ, ఆర్యవైశ్య సంఘం మరియు కూటమి నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, సత్యం--అహింస సిద్ధాంతాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రాష్ట్ర మాజీ



కార్యవర్గ సభ్యులు తలుపు ల గంగాధర్, పట్టణ అధ్యక్షుడు పీట్ల రామకృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ సమీవుల్లా, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి కొత్త రమేష్ బాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు ముచ్చుకోట్ల గోవర్ధన్, మాజీ జిల్లా కార్యదర్శి అశోక్, జరిపిటి జయరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బుడగల హరీష్ ,ఖద్దర్ వెంకటరమణ ,చంద్రశేఖర్ మరియు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళులు
సేవా సంకల్ప్ అభియాన్‌లో మొక్కలు నాటిన మంత్రి సత్యకుమార్

ధర్మవరం, దరువు న్యూస్: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ధర్మవరం



పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా గాంధీ సర్కిల్ పరిసరాల్లోని డివైడర్లపై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సమానత్వం, సేవాభావం వంటి గాంధీజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు ప్రజల్లో పచ్చదనంపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు.నాటిన మొక్కలను సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు.గాంధీ జయంతిని కేవలం నివాళులర్పించే రోజుగా కాకుండా సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా భావాలను ఆచరించేలా సంకల్పం తీసుకునే రోజుగా భావించాలని మంత్రి పిలుపునిచ్చారు.

జాతిపితకు ఘన నివాళులు
ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామసభ

సోమందేపల్లి,దరువు న్యూస్ : సోమందేపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం నందు ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం నందు గ్రామస్తులతో ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేశారు.ఈ గ్రామ సభలో అధికారులు మాట్లాడుతూ



ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,స్వచ్ఛత త్రాగునీరు,బాల్య వివాహాలు నిర్మూలన పౌష్టిక ఆహారం మరియు గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ ప్రేమకుమార్, యం.ఎస్. జీ.ఓ రాజశేఖర్, సిడిపిఓ శాంతలక్ష్మి,సూపర్ వైజర్ శుభరాణి,జనసేన నాయకులు నాగరాజు, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్,సచివాలయ సిబ్బంది యోగీశ్వర్, చౌడేశ్వరి,గౌతమి,పంచాయతీ సిబ్బంది,వైద్య సిబ్బంది, స్వచ్ఛ భారత్ కార్మికులు, అంగన్వాడి టీచర్స్,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం



పెనుకొండ,దరువు న్యూస్: లక్ష కోట్లతో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమ దేశంలోనే అతిపెద్ద ఉద్యానవన క్షేత్రంగా మారబోతోందని రాష్ట్ర బీసీ,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత,జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ విగ్రహం వరకు రైతులతో కలిసి మంత్రి సవిత ర్యాలీ నిర్వహించి హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు 'రాళ్లసీమ'గా పిలవబడిన రాయలసీమ ప్రాంతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సస్యశ్యామలంగా మారుతోందన్నారు.ఇప్పటికే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పుట్టపర్తి అభివృద్ధికి వరం



పుట్టపర్తి, దరువు న్యూస్: సత్యసాయి జిల్లా పరిధిలో నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్-544జీ బెంగళూరు--విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో రాజ్‌పత్ ఇన్‌ఫ్రా సంస్థ ప్రపంచ రికార్డు సాధించడం పుట్టపర్తి నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు.సాదర్లపల్లి వద్ద 24 గంటల్లో 28.95 లేన్ కిలోమీటర్ల మేర బిటుమినస్ కాంక్రీట్ పనులు పూర్తి చేసి, 10,675 మెట్రిక్ టన్నుల మెటీరియల్‌ను వినియోగించినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు రాజ్‌పత్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు జగదీశ్ కదం, మోహనా జగదీశ్ కదం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిని కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డు షీల్డ్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే పుట్టపర్తి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రపంచ రికార్డు సాధించిన రాజ్‌పత్ ఇన్‌ఫ్రా సంస్థ యాజమాన్యం, ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది, కార్మికులకు ఆమె అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

28 వార్డుల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా పనిచేయాలి



పుట్టపర్తి దరువు న్యూస్: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పుట్టపర్తి మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.ప్రతి వార్డులో నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నేతలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవాలని, వారి సమస్యలను తెలుసుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రతి వార్డును ప్రత్యేక బాధ్యతగా తీసుకుని స్థానిక నాయకులతో కలిసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు.ఐక్యత, సమన్వయంతో పనిచేస్తే 28 వార్డుల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి బలమైన పునాది ఏర్పడుతుందని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి



కదిరి, దరువు న్యూస్: కదిరి ప్రాంతంలో ఉన్న క్రికెట్ సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని ఆర్‌డీటీ ప్రాంతీయ సంచాలకులు రఘురామ్, ఆర్‌డీటీ క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మచ్చా రామలింగారెడ్డి సూచించారు.ఆర్‌డీటీ ఆధ్వర్యంలో కదిరి డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ ప్రతిభాన్వేషణ ఎంపికలు నిర్వహించారు.ఈ ఎంపికల్లో మొత్తం 90 మంది



క్రీడాకారులు పాల్గొన్నారు.ప్రతిభావంతులను గుర్తించి మెరుగైన శిక్షణ కోసం కోచింగ్ శిబిరాలకు పంపనున్నట్లు రఘురామ్ తెలిపారు.మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ కదిరి ప్రాంతం నుంచి పలువురు క్రికెట్ క్రీడాకారులు రంజీ స్థాయికి ఎదిగారని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసి వారికి అవసరమైన శిక్షణ, సౌకర్యాలు కల్పించడమే ఆర్‌డీటీ లక్ష్యమన్నారు. మాజీ భారత, ఆంధ్ర క్రికెట్ ఆటగాళ్ల సహకారంతో శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సెలెక్టర్లు సాయి కార్తీక్ రావు, విజయ్, ప్రశాంత్ రెడ్డి, షకీర్, ఆర్‌డీటీ గ్రాస్‌రూట్స్ కోఆర్డినేటర్ కె. ప్రవీణ్, కోశాధికారి ముబారక్, క్రీడా సీనియర్లు నాగరాజ్, అనిల్, దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి టీడీపీ నాయకుల నివాళి



అనంతపురం, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు అర్బన్ టీడీపీ కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గం టీడీపీ నాయకులు గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, బుగ్గయ్య చౌదరి, నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మహాత్మా గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను, దేశం కోసం ఆయన పాటుపడిన ఆశయాలను స్మరించుకున్నారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్మా గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సేవాభావంతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్‌లు, సరిపుటి రమణ, డిష్ నాగరాజు, రాజారావు, వన్నూరప్ప, కేశవ నాయుడు, గోపాల్ గౌడ్, కూరగాయల శ్రీధర్, కృష్ణం రఘు, కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, బొమ్మినేని శివ, పరమేశ్వర్, మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, టీడీపీ నాయకులు గోళ్ళ సుధాకర్ నాయుడు, నాగభూషణం, దాదా ఖలందర్, చౌడయ్య, కదరప్ప, నారాయణస్వామి, శివ, ఓబుల్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన నాయకులు



అనంతపురం, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

మహాత్మ గాంధీజీ జయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో టీడీపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సేవా మేరా యోగ్ దాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి యువ నాయకుడు బోయపాటి శివరామ్ లు మొక్కలు నాటారు. సుమారు 300 మొక్కలను ఈ పార్కులో నాటారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. మహాత్మ గాంధీజీ చూపిన సేవా మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ పరిసరాలను పచ్చదనంతో నింపేందుకు మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టీడీపీ యువ నాయకుడు బోయపాటి శివరామ్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, మాజీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, టీడీపీ నాయకులు సరిపుటి రమణ, బొమ్మినేని శివ, నెట్టెం బాలకృష్ణ, నల్లాని మనోహర్ నాయుడు, సాకే లక్ష్మీనరసింహ, కేశవ నాయుడు, కాయగూరల శ్రీధర్, కుంచపు వెంకటేశులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి : ఎస్టీయూ



అనంతపురం, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ఆయన అడుగు, జాడలలో నడిచి దేశానికి పాటు పడినప్పుడే ఆయనకు ఘన నివాళి అని కొనియాడారు. ఉపాధ్యాయులు నిత్య బోధనలో పిల్లలకు గాంధీ సేవలు ఆయన శాంతియుత పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కమిటీ కన్వీనర్ బి.ఫణి భూషణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.మల్లిఖార్జున, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ మోహన్ జిల్లా ఉపాధ్యక్షుడు మిద్దె మురళీ కృష్ణ, జిల్లా నాయకులు నిట్టూరు చంద్రశేఖర రావు, వెంకటేశులు, బాబ్జీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు 'ఉద్యాన' హబ్ హంగులు

- రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్.. సీమను 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దే లక్ష్యం
- మంత్రి సవితమ్మ, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హాజరు
- రైతులకు యంత్రబలం, మార్కెట్.. ప్రాసెసింగ్ సదుపాయాలపై దృష్టి





పుట్టపర్తి, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

2047 విజన్‌లో భాగంగా రాయల సీమ ప్రాంతాన్ని సమగ్ర ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ తెలిపారు. పుట్టపర్తిలోని సాయిరామంలో నిర్వహించిన కస్టమ్ హైరింగ్ సెంటర్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి మంత్రి సవితమ్మ పాల్గొన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే కస్టమ్ హైరింగ్ సెంటర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఖరీదైన వ్యవసాయ యంత్రాలను రైతులు సొంతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా కేంద్రాల ద్వారా అద్దె ప్రాతిపదికన వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో సాగు ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని, వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. రాయలసీమ ఒక ప్పుడు కరువు, వెనుకబాటుతనంతో ఇబ్బందులు ఎదుర్కొందని, ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యానవన రంగాల విస్తరణతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని సవితమ్మ అన్నారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలుగొండ వంటి ప్రాజెక్టులతోపాటు కుప్పం, మడకశిర ప్రాంతాలకు సైతం సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 2047 విజన్‌లో భాగంగా సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో రాయలసీమను సమగ్ర ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి వెల్లడించారు. ఇందులో సుమారు రూ.20వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, రూ.5,500 కోట్లు గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేటాయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో సైతం సుమారు రూ.1,600 కోట్లతో ఉద్యానవన రంగ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాయలసీమలో మామిడి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు వివిధ రకాల ఉద్యాన పంటలు, పూల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు సమూహాలుగా ఏర్పడి ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకుంటే 75 శాతం వరకు, వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకుంటే 50 శాతం వరకు సబ్సిడీ అందించే విధానం అమల్లో ఉందన్నారు. కోల్డ్ స్టోరేజీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, రవాణా వాహనాలకు సబ్సిడీలు కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉద్యాన పంటల విస్తరణతో పాటు ఆహార శుద్ధి, మార్కెటింగ్, ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సవితమ్మ పేర్కొన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ యాంత్రీకరణ మరింత విస్తరించి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ధర్మవరం కోసం అందరూ భాగస్వాములు కావాలి

- పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రత పనుల్లో మంత్రి సత్యకుమార్



ధర్మవరం, అక్టోబరు 2, దరువు న్యూస్ :

పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా స్వీకరించి ధర్మవరాన్ని స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా-2026' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి స్వయంగా మార్కెట్ పరిసరాల్లో శుభ్రత పనులు చేపట్టారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకర సమాజానికి పునాది అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే సరిపోవని, ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. ప్రతి కుటుంబం ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సూచించిన ప్రాంతా ల్లోనే వేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించే అలవాటును ప్రజలు పాటించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం : పట్టణ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను మంత్రి అభినందించారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న వారి కృషిని గుర్తిస్తూ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పారిశుద్ధ్య కార్మికులకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మవరాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషితోనే స్వచ్ఛ ధర్మవరం లక్ష్యాన్ని సాధించగలమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, స్థానిక భాజపా నాయకులు, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం

అనంతపురం రూరల్ సీడీపీఓ ఉమా శంకరమ్మ

అనంతపురం, అక్టోబర్ 2, దరువు న్యూస్ :

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని అనంతపురం రూరల్ సీడీపీఓ ఉమా శంకరమ్మ అన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ పరిధిలోని విద్యారణ్యనగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ మహా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలించడం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించడం వంటి సేవలను అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్నాయని తెలిపారు. ఇంటి వద్ద లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని సూచించారు. అలాగే ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా అర్హులైన గర్భిణులు, బాలింతలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పథకంలో నమోదు చేయడం, అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అంగన్వాడీ సిబ్బంది చొరవ చూపాలని తెలిపారు. బాల్యవివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలగడంతో పాటు చిన్న వయసులో గర్భధారణ, తల్లి-శిశువుల ఆరోగ్య సమస్యలు తదితర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆమె వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు కలిసి పనిచేయాలని, బాలికలు చదువును కొనసాగించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ సూపర్వైజర్ జ్యోతితోపాటు అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లే ఎల్ఐసీకి పునాదులు..

బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్



అనంతపురం, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి ఏజెంట్లే పునాది లాంటి వారని బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ పేర్కొన్నారు. లియాపి (భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య) 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడి ఎల్ఐసీ బ్రాంచ్ 1 కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. లియాపి (భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయక్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారతీయ జీవిత బీమా సంస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నదని అన్నారు. సంస్థ ఇంత బలోపేతం కావడానికి 62 సంవత్సరాల పాటు ఏజెంట్లు చేసిన కృషి పట్టుదలే కారణమన్నారు. ఒకవైపు పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తూనే మరోవైపు సమస్త బలోపేతానికి ఏజెంట్లు చేసిన కృషి అమోఘమన్నారు. అనంతరం లియాపి (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) కడప డివిజన్ నాయకులు సాధనగిరి తిరుపతయ్య మాట్లాడుతూ.. పాలసీదారులకు జీఎస్టీని తొలగించడంలో గాని ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు యుద్ధ ప్రాతిపదికన క్లెయిమ్లను పరిష్కరిస్తున్నామన్నారు. పాలసీదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఎల్ఐసి అగ్రభాగాన ఉంటుందన్నారు. కార్యక్రమం ప్రారంభం ముందు లియాపి జెండాను భారత జీవిత బీమా సంస్థ సీనియర్ ఏజెంట్ ఏ.వెంకటనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అనంతరం టవర్ క్లాక్ దగ్గర ఉన్నటువంటి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అభివృద్ధి అధికారి అజయ్ కుమార్ లియాపి కడప డివిజన్ అధ్యక్షుడు కే.వెంకటేశులు, బి.మల్లికార్జునయ్య, బాలం భాస్కర్, ఆర్ వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, నరేంద్ర, బాలకృష్ణ, ఆదినారాయణ, రామకృష్ణ, మల్లికార్జున్ రెడ్డి, లింగమయ్య తదితర ఏజెంట్లు పాలసీదారులు భారీగా పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు



పుట్టపర్తి, అక్టోబర్ 02, దరువు న్యూస్ :

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజల అవగాహన కోసం పలు సూచనలు, ఆదేశాలను వెల్లడించారు. జాబితాలో వివరాలు అనుసంధానం కాకపోవడం, వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం వంటి కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకు సంబంధిత స్థాయి అధికారులు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి పరిశీలనకు సమర్పించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును తప్పనిసరిగా ఎన్నికల నమోదు అధికారి కార్యాలయానికి పిలిచి విచారణ నిర్వహించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే విచారణ చేపట్టాలని, సాధ్యమైనంత వరకు అంతర్జాలం ద్వారా విచారణ నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం సూచించినట్లు తెలిపారు. విచారణ అవసరమైన సందర్భంలో సంబంధిత ఓటరు తన తరఫున కుటుంబంలోని వయోజన సభ్యుడిని హాజరయ్యేలా అధీకృతం చేయవచ్చని తెలిపారు. అంతర్జాల విచారణకు అవసరమైన సౌకర్యా లను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయులు తదితరులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలు, శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సమయంలో లేదా అనంతరం తమ పేరు జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన యువత నిరంతర నవీకరణ ప్రక్రియలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు సంబంధిత ఎన్నికల నమోదు అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

గాంధీజీ ఆశయాలను ఆచరించాలి : మంత్రి సత్యకుమార్



ధర్మవరం, అక్టోబరు 2, దరువు న్యూస్ :

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ధర్మవరం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో జాతిపిత విగ్రహానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా గాంధీ సర్కిల్ డివైడర్లపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి, సమానత్వం, సేవాభావం వంటి విలువలను జీవితాంతం ఆచరించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహాత్మాగాంధీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. గాంధీజీ స్వచ్ఛత, పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకర సమాజానికి పునాది అని మంత్రి పేర్కొన్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇల్లు, పరిసరాలు, గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మొక్కలు నాటడం ద్వారా పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గాంధీ జయంతిని కేవలం నివాళులర్పించే రోజుగా కాకుండా సత్యం, అహింస, స్వచ్ఛత, సేవ, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలను ఆచరించేందుకు సంకల్పం తీసుకునే రోజుగా భావించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన ఆరోగ్యకరమైన ధర్మవరం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.